సాక్షి నిర్మల్

గురువారం । 15 । జూన్ । 2023



పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు

బడిబాటలో భాగంగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి ప్రవేశాలు కల్పించారు. 5లో▸



శిథిలావస్థకు బస్‌షెల్టర్లు

లోకేశ్వరం మండలంలోని పలు బస్‌షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. కొన్నిచోట్ల అపరిశుభ్రంగా మారి నిరుపయోగమయ్యాయి. ప్రయాణికులకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. 5లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0 /28.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన పూలాజీబాబా ఆశ్రమ సభ్యులు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఆశ్రమ సభ్యులు

నిర్మల్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం పట్నాపూర్‌లోని శ్రీపరమ హంస సద్గురు పూలాజీబాబా ఆశ్రమ సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలాజీబాబా మందిరానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి దేవాదాయశాఖ తరపున రూ.కోటి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమ సభ్యులు మంత్రిని శాలువాతో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ సుభాష్‌రావు, ఆశ్రమ సభ్యులు కేశవ్, నాగోరావు, దాదారావు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు రావడంపై మంత్రి హర్షం

నిర్మల్‌టౌన్: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి లండన్‌కు చెందిన గ్రీన్ ఆర్గనైజేషన్ సంస్థ నుంచి గ్రీన్ యాపిల్ అవార్డు రావడంపై రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రానికి దక్కిన అపూర్వ గౌరవమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మంత్రి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

బుర్కలేగడికి త్రీఫేజ్ కరెంట్



జనుబాయిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పెంబి: మండలంలోని అంకెన గ్రామపంచాయతీ పరిధి మారుమూల గ్రామమైన బుర్కలేగడి గ్రామానికి త్రీఫేజ్ కరెంట్ సౌకర్యం లేదు. జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి గిరిజనులు పడుతున్న కరెంట్ కష్టాలను సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్‌ఈ జైవంత్ చౌహాన్ సర్వే నిర్వహించి త్రీఫేజ్‌కు కావాల్సిన పరికరాలు ఆ గ్రామానికి తరలించారు. దీంతో తమ గ్రామానికి త్రీఫేజ్ వస్తుందని తెలియడంతో గిరిజనులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ జానుబాయికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గ్రామానికి పిలిచి శాలువాతో సన్మానించారు.

క్విజ్‌లో పాల్గొనేవారు పేరు నమోదు చేసుకోండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భైంసాటౌన్: ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్విజ్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు అంజాద్ షేక్ కోరారు. బుధవారం భైంసాలో క్విజ్ పోటీల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ఆదర్శంగా తీసుకుని జూలై 2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16 ఏళ్లు నిండిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రథమ బహుమతిగా ల్యాప్‌టాప్, ద్వితీయ బహుమతిగా స్మార్ట్‌ఫోన్, తృతీయ బహుమతిగా ట్యాబ్, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 మందికి స్మార్ట్‌వాచ్‌లు, ఇతర బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళా విభాగంలో మొదటి స్థానంలో నిలిస్తే ఎలక్ట్రిక్ స్కూటీ బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని, వివరాల కోసం 7661899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇస్తే రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందని పేర్కొన్నారు. రిఫరల్ కోడ్ 0290 ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 8519990416, 6305674166 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. నాయకులు ఇమ్రాన్, నవీన్, రాజ్‌కుమార్, సుమన్ ఉన్నారు.

'ఒంటిపూట బడి నిర్వహించాలి'

ఖానాపూర్: ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొద్దిరోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటిపూట బడి నిర్వహించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బీ గోవింద్‌నాయక్ కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రభాకర్, రాజేశ్, విలాస్, నరేశ్ తదితరులున్నారు.

చేరికపై చర్చ



కూచాడి శ్రీహరిరావు

- కాంగ్రెస్‌లోకి కూచాడి శ్రీహరిరావు
- 'హస్త' ప్రభావంపై పార్టీల చర్చ
- ఆరా తీస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలు
- ఇబ్బంది లేదంటున్న ఇరుపార్టీలు
- సత్తా చాటుతామంటున్న కాంగ్రెస్

నిర్మల్: రాజకీయంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే నిర్మల్ ఓ కేంద్రబిందువుగా కొనసాగుతోంది. త్వరలోనే ఎన్నికలు రానున్నవేళ జిల్లాలో చోటుచేసుకుంటున్న మార్పులు అందరినీ ఆకర్షిస్తున్నాయి. తాజాగా ఉద్యమనేత, బీఆర్‌ఎస్ అసమ్మతి నాయకుడు కూచాడి శ్రీహరిరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంపై చర్చమొదలైంది. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరడమే ఇందుకు కారణం. ఆయన హస్తంగూటికి చేరడంతో తమకెలాంటి ఇబ్బంది లేదని చెబుతున్న బీఆర్‌ఎస్, బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత ఆరాతీస్తున్నాయి. ఇక దేశం, రాష్ట్రమంతటా ఎలా ఉన్నా.. జిల్లాలో రాజకీయ పరిస్థితులు కొంత భిన్నంగా ఉండటం సహజం. ఇక్కడ క్యాడర్ కాదు కదా.. కనీసం ఎన్నికల గుర్తు కూడా సరిగ్గా తెలియని పార్టీలు ఘనంగా గెలిచిన రోజులున్నాయి. అందుకే శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆత్మాభిమానం కోసం..

తను కావాలనుకుంటే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వద్దకు వెళ్లి పనులు చేయించుకోగలను, కానీ.. ఉద్యమకారులకు గుర్తింపులేని చోట ఆత్మాభిమానం చంపుకొని ఉండలేనంటూ కూచాడి శ్రీహరిరావు కాంగ్రెస్‌గూటికి చేరారు. తనకు రాజకీయగురువుగా పేర్కొనే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డినే ఢీకొనేందుకు రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా వేసుకున్నారు. గత ఎన్నికల్లో కారు గుర్తు గెలుపుకోసం ఎంత శ్రమించినా కనీసం ఇచ్చిన హామీమేరకు ఎమ్మెల్సీ కూడా ఇవ్వకపోవడమూ కూచాడి కాంగ్రెస్ వైపు వెళ్లడానికి కారణమన్న వాదనలున్నాయి. ఏదిఏమైనా గత ఎన్నికల్లోనే పోటీకి తమనేత దూరంగా ఉన్నారని, ఈసారైనా పోటీచేస్తేనే తనకు, తమకు ఉనికి ఉంటుందన్న వాదనను ఆయన అనుచరులు బలంగా వినిపిస్తున్నారు. అందుకే వారంతా ఆయన వెంటే కాంగ్రెస్‌బాట పట్టారు.

లాభమేనంటున్న బీజేపీ..

శ్రీహరిరావు బీఆర్‌ఎస్‌లో ఉంటే ఇబ్బంది కానీ కాంగ్రెస్‌లో చేరితే తమకే లాభమన్న వాదనను బీజేపీ నాయకులు వినిపిస్తున్నారు. ఒకవేళ ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే చీల్చేది బీఆర్‌ఎస్ ఓట్లేనని చెబుతున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కీలకంగా ఉన్న మైనార్టీ ఓట్లు కూడా రెండు పార్టీల మధ్య చీలితే మెజార్టీ ఓట్లు తమకే వస్తాయన్న అంచనాలు వేస్తున్నారు. ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల్లో కూచాడి ప్రభావం పెద్దగా ఉండదని, నిర్మల్‌లో ఆయన రాక వందశాతం తమ పార్టీకే లాభమన్న భావన బీజేపీనుంచి వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లో జోష్ పెరిగేనా?

ఏఐసీసీ స్థాయికి ఎదిగిన మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రామారావుపటేల్ తదితరులు వెళ్లిపోవడంతో జిల్లాలో కాంగ్రెస్ కుదేలైంది. మళ్లీ కోలుకుంటుందో లేదోనన్న స్థాయికి దిగజారింది. ఒకరిద్దరు నేతలు మినహా పెద్దగా చెప్పుకోదగ్గ నాయకులెవరూ మిగల్లేదు. ఇలాంటి సందర్భంలో సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి చేరడం, యువనాయకులు అర్జుమంద్‌అలీ, జునైద్, సేవాదళ్ మాజీ నేత ఎంబడి రాజేశ్వర్ తదితరులు యాక్టివ్ కావడం కొంత ఊరటనిచ్చింది. అయినా ఎన్నికల్లో పోటీచేసే స్థాయిలో లేదనుకుంటున్న సమయంలో శ్రీహరిరావు చేరడం కాంగ్రెస్‌లో కొంత జోష్ నింపింది. అంతా అయిపోయిందని అనుకుంటున్న తరుణంలో రానున్న ఎన్నికలపై ఆశలు పెట్టుకునే స్థాయికి పార్టీ చేరడంతో క్యాడర్ సంతృప్తి వ్యక్తంచేస్తోంది.

ఇబ్బంది లేదంటున్న బీఆర్‌ఎస్

రాజకీయంగా శ్రీహరిరావును తమ పార్టీయే పెద్దనేతను చేసిందని, తల్లిలాంటి పార్టీని వదిలివెళ్తే ఆయనకే నష్టమని కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారు. 2009, 2014 ఎన్నికల్లో ఓడిపోయి, 2018ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉన్న ఉద్యమనేతను ప్రజలు మర్చిపోయారంటున్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన ఎలాంటి ప్రభావం చూపలేరని మరో నేత పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ నిర్మల్ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఇబ్బందేమీ ఉండదని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయనే గెలుస్తారని ధీమా వ్యక్తంచేశారు. కొంతమంది ఉద్యమకారులు, అనుచరులు మినహా కూచాడి శ్రీహరిరావు వెంట ఎవరూ లేరని, కాంగ్రెస్‌లో ఉన్న బడా లీడర్లు ఎప్పుడో పార్టీ మారారని ఇలాంటి పరిస్థితుల్లో గెలవడం సాధ్యం కాదంటున్నారు. ఇప్పటికిప్పుడు ఆయనతో బీఆర్‌ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని ధీమా వ్యక్తంజేస్తున్నారు.

'రిజిస్ట్రేషన్' అక్రమాలకు చెక్!

- ఇక అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- స్టాంపుల విక్రయాలు కూడా..
- మాన్యువల్ విధానానికి స్వస్తి
- ఏ రోజు రిజిస్ట్రేషన్లు ఆ రోజే పూర్తి
- తొలిరోజు మొరాయించిన సర్వర్



సర్వర్‌డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేచిచూస్తున్న జనం

కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాల కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇన్నాళ్లు మాన్యువల్‌గా సాగిన రిజిస్ట్రేషన్ వ్యవహారాలతోపాటు స్టాంపుల విక్రయాలకు పూర్తిగా స్వస్తి పలికింది. స్టాంపు వెండర్లు బహిరంగ మార్కెట్‌లో నేరుగా విక్రయించడాన్ని నియంత్రించిన సర్కారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశాకే వాటిని విక్రయించేలా ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్లు కూడా ఏ రోజుకారోజు పూర్తయ్యేలా సబ్‌రిజిస్ట్రార్లకూ బయోమెట్రిక్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అక్రమాలకు పూర్తిగా చెక్‌పడటంతో పారదర్శకత పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అనుమతి పొందిన స్టాంప్ వెండర్లకు సబ్ రిజిస్ట్రార్ల మాదిరిగానే వారికి ప్రత్యేక లాగిన్ ఇవ్వడంతో పాటు యూజర్ ఐడీ, పాస్‌వర్డు కూడా కేటాయించారు. వారు ఆ లాగిన్ ద్వారా సబ్‌రిజిస్ట్రార్ల నుంచి స్టాంపుల విక్రయాలు చేపట్టాల్సి ఉంటుంది. బాండ్ పేపర్లు కూడా ఇదే విధానంలో అమ్మనున్నారు. దీంతో రోజువారీగా ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఎన్ని స్టాంపులు, బాండ్ పేపర్లు విక్రయించారనే లెక్క పక్కాగా తేలనుండటంతో పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సబ్ రిజిస్ట్రార్లకూ బయోమెట్రిక్

రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వ్యవహారాలను కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశించిన ప్రభుత్వం సబ్‌రిజిస్ట్రార్లకు కూడా బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ప్లాట్లు, ఇండ్లు, భూముల రిజిస్ట్రేషన్ల కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు డాక్యుమెంట్స్‌ను అందజేసి, ఫొటో దిగిన తర్వాత ఇదివరకు సబ్ రిజిస్ట్రార్లు చెక్ స్లిప్‌లను తీరిగ్గా పరిశీలించి రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించేవారు. కానీ.. ఇప్పుడలా కుదరదు. ఫొటో దిగిన వెంటనే సబ్‌రిజిస్ట్రార్ తనకు కేటాయించిన ఐడీ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్స్‌ను పరిశీలించి అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఏ రోజు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆ రోజే పూర్తయ్యే అవకాశం కలుగుతుంది. బుధవారం నుంచే ఈ విధానం అమల్లోకి రావడంతో సర్వర్ డౌన్ సమస్య తలెత్తింది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు తీవ్రంగా నిరీక్షించాల్సి వచ్చింది. తొలిరోజున అనుకున్న స్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరగలేదు.

సెల్‌ఫోన్ ద్వారా కూడా దరఖాస్తు

స్టాంప్‌లను కొనుగోలు చేయాలనుకునేవారు సెల్‌ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం మొబైల్‌లో టీయాప్ పోలియో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలోకి వెళ్లాలి. స్టాంప్స్‌పై క్లిక్ చేసి తమకు అవసరమైన వాటి వివరాలు నమోదు చేసి డబ్బులు చెల్లించాలి. సంబంధిత స్లిప్‌తో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి స్టాంపులను కొనుగోలు చేయవచ్చు.


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వివరాలు

జిల్లా	సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు	తొలిరోజు రిజిస్ట్రేషన్లు
ఆదిలాబాద్	ఆదిలాబాద్, బోథ్	45
నిర్మల్	నిర్మల్, ఖానాపూర్, భైంసా	21
మంచిర్యాల	మంచిర్యాల, లక్సెట్టిపేట	31
కుమురంభీం	ఆసిఫాబాద్	04



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంప్ వెండర్ల సంఖ్య : 131

పారదర్శకత పెరుగుతుంది



రిజిస్ట్రేషన్ శాఖ వ్యవహారాలన్నింటినీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే ఆన్‌లైన్‌లో స్టాంపులు, బాండ్లను విక్రయించేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాత తేదీల్లో విక్రయించేందుకు అవకాశముండదు. సబ్ రిజిస్ట్రార్లకు కూడా బయోమెట్రిక్ అమలు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో పనులు త్వరగా పూర్తికావడంతో పాటు పారదర్శకత పెరగనుంది.

– అశోక్, సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

ఆన్‌లైన్‌లోనే స్టాంపుల విక్రయాలు

స్టాంపులు, బాండ్ పేపర్ల విక్రయాల్లో అనేక అక్రమాలు జరుగుతున్నట్లుగా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వాటి కట్టడికి చర్యలు చేపట్టింది. గతంలో బహిరంగ మార్కెట్‌లో స్టాంపులను నేరుగా విక్రయించారు. ఈ క్రమంలో పలువురు పాత తేదీలు వేసి అక్రమాలకు పాల్పడేవారు. ఇలాంటి వాటిని నియంత్రించాలని భావించిన తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా ఆన్‌లైన్ విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 131 మంది స్టాంపు వెండర్లు ప నిచేస్తున్నారు. వీరంతా ఆన్‌లైన్‌లో స్టాంపులు, బాండ్లు విక్రయించేందుకు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలి.



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

తెలంగాణ ఏర్పడ్డాకే వైద్యరంగంలో పురోగతి



పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి తదితరులు

- దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి ఐకేరెడ్డి
- ఘనంగా వైద్య ఆరోగ్య దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పదేళ్లలో జిల్లాలో జరిగిన అభివృద్ధిపై స్టాళ్లు ఏర్పాటు చేసి వివరించారు. గర్భిణుల్లో రక్తహీనతను నివారించడానికి రెండో విడత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి పలువురికి కిట్లు అందజేశారు. ఏఎన్‌ఎంలకు బీపీ ఆపరేటర్లు, ఆశ కార్యకర్తలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి, ప్రసూతి ఆస్పత్రి సిబ్బంది ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో మంత్రి, కలెక్టర్ రూ.23.75 కోట్లతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, రూ.50 లక్షలతో చేపట్టిన 30 పడకల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రూ.166 కోట్లతో వైద్యకళాశాల మంజూరైందని, జూన్ నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. 24మంది సీనియర్ రెసిడెన్స్ డాక్టర్లు నియమించగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇద్దరు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 22మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించినట్లు తెలిపారు. వైద్యకళాశాల మొదటి ఏడాది 330 పడకలతో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మాతృత్వ మరణాలను అరికట్టేందుకు జిల్లాలో 'అనీమియా సే నిర్మల్ ముక్త్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి రాష్ట్ర స్థాయి పురస్కారాలు

జిల్లాలో వైద్యారోగ్యశాఖలో విశిష్ట సేవలందించిన పలువురికి పురస్కారాలు అందజేశారు. ఉత్తమ మెడికల్ ఆఫీసర్లుగా మమత (జిల్లా ప్రసూతి ఆస్పత్రి), శ్రీనివాస్ (సోన్ పీహెచ్‌సీ), గంగాదాస్ (జిల్లా ఆయుష్ విభాగం), స్టాఫ్‌నర్స్ విభాగంలో స్వర్ణలత (ముజ్గి పీహెచ్‌సీ), మాణిక్య వీణ (జిల్లా ఆస్పత్రి), ఫార్మసిస్ట్ విభాగంలో ఎస్.శ్రీనివాసాచారి (జిల్లా ఆస్పత్రి), వేణుగోపాల్ (డీఎంహెచ్‌వో కార్యాలయం), ఉమాదేవి (ఆయుష్ విభాగం), భాగ్యరేఖ (ఏఎన్‌ఎం), సంతోష్‌కుమార్ (ల్యాబ్ అసిస్టెంట్), శ్రీనివాస్ (ఆరోగ్యమిత్ర), రాజశ్రీ (ఆశ కార్యకర్త), రమేశ్ (ల్యాబ్‌టెక్నీషియన్) మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు.

రూ.లక్ష సాయం కోసం బారులు..!

- దరఖాస్తుదారులతో మీసేవ కేంద్రాలు కిటకిట
- సర్వర్ సమస్యతో దరఖాస్తు ప్రక్రియలో జాప్యం



భైంసాలోని ఓ మీసేవ కేంద్రంలో అర్జీదారులు

భైంసాటౌన్: బీసీల్లోని చేతి, కులవృత్తుల కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ సైతం ప్రారంభం కావడంతో, చేతివృత్తులవారు దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు వందల్లో దరఖాస్తుదారులు వస్తుండడంతో మీసేవ కేంద్రాలు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. కాగా, ఏయే కులవృత్తుల వారు అర్హులనే విషయంపై చాలామందికి స్పష్టత లేకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చి, అర్హులు కాదని తేలడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సర్వర్ సమస్యతో ఇబ్బందులు...

ఇదిలా ఉండగా, టీఎస్ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ సర్వర్‌లో సమస్య కారణంగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అంతరాయం ఏర్పడుతోందని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు. దరఖాస్తు చేసే క్రమంలో కుల ధ్రువీకరణ పత్రాలు సరిగా లేవని చూపుతోందని పేర్కొంటున్నారు. అంతేగాక, పూర్తి ఫాం నింపిన తర్వాత వెబ్‌సైట్ ఒక్కసారిగా క్లోజ్ అవుతోందంటున్నారు. దీంతో రోజుకు ఒకటి లేదా రెండు మాత్రమే దరఖాస్తులు పూర్తవుతున్నాయంటున్నారు. దరఖాస్తుకు ఈనెల 20 వరకు గడువు ఉండగా, గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

అర్హులు వీరే...

బీసీల్లోని 15 కులవృత్తులవారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. కాగా, చాలామందికి ఏయే కులాలవారు అర్హులనే విషయంపై స్పష్టత లేదు. ప్రభుత్వం ప్రకటించిన కులాలు ఈ విధంగా ఉన్నాయి..

- నాయీబ్రాహ్మణ, రజక, సగర/ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అవుసలి, కంసాలి, వడ్రంగి/శిల్పులు, వడ్డెర, కమ్మరి, కంచరి, మేదరి, కృష్ణబలిజ పూసల, మేర, ఆరె కటిక, ఎంబీసీ కులాల వారు అర్హులు. వయసు 21–55 ఏళ్లలోపు వారు, గ్రామాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలలోపు ఆదాయం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

అప్‌లోడ్ కావడం లేదు

కులవృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చాను. బీసీ ఏ (నాయీబ్రాహ్మణ) కుల ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోలడం లేదని చూపిస్తోంది.

– రమాకాంత్, కులవృత్తిదారు, దేగాం

దరఖాస్తు గడువు పెంచాలి

బీసీ కులవృత్తులవారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలని ప్రకటించడం హర్షణీయం. అయితే ఎలాంటి షరతులు లేకుండా అర్హులైనవారికి సహాయం అందించాలి. సర్వర్ సమస్య తలెత్తుతున్న కారణంగా దరఖాస్తు గడువు పెంచాలి. – సుంకెట పోశెట్టి, బీసీ హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

బాసరలో భక్తుల రద్దీ



భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి బుధవారం భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. ముందుగా గోదావరినదిలో స్నానాలాచరించారు. అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. చిన్నారులతో అక్షరశ్రీకార పూజలు చేయించారు.

డీలర్లకు అవగాహన సదస్సు



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వినయభాస్కర్

సోన్: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కడ్తాల్ క్లస్టర్ రైతువేదికలో బుధవారం ఆగ్రో రైతు సేవాకేంద్రం డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ వినయ్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఆగ్రోస్ రీజినల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ.. వానాకాలం సీజన్‌లో నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఇన్‌చార్జి ఏవో ప్రవీణ్‌కుమార్, తెలంగాణ ఆగ్రోస్ నిజామాబాద్ రీజినల్ అధికారి డీఈవో గీత, జిల్లా మార్కెట్ ఎగ్జిక్యూటివ్ అధికారి వికాస్, జిల్లా ఆగ్రోస్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సినీఫక్కీలో కలప తరలింపు



అంబులెన్స్‌లో కలప

నిర్మల్‌టౌన్: పుష్ప సినిమా తరహాలో బుధవారం అంబులెన్స్‌లో కలప తరలిస్తుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జైపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని చంద్రాపురం నుంచి నిర్మల్ మీదుగా కామారెడ్డికి అంబులెన్స్‌లో కలప తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మామడ మండలం మొండిగుట్ట తాండ్ర వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో కలప లభ్యంకావడంతో నిర్మల్‌లోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వాటి విలువ రూ.2 లక్షల 30 వేలు ఉంటుందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. వాహనానికి నాలుగు నంబర్ ప్లేట్లు వాడుతున్నార న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఆర్టీల నియామకం పారదర్శకంగా చేపట్టాలి



ఏపీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో సీఆర్టీల నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ బుధవారం ఐటీడీఏ ఏపీవో భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్తీ ప్రక్రియ రహస్యంగా కాకుండా మెరిట్ జాబితాను బహిరంగపర్చి అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. ఎంపిక పరీక్షకంటే ముందే ఏఏ సబ్జెక్టుల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట సంఘం నాయకులు మెస్రం రాజు, కోట్నాక్ లక్ష్మణ్, భూమేశ్, తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

భైంసాటౌన్(ముధోల్): పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు. నయాబాదికి చెందిన నబా తబస్సుమ్(19) ఈ నెల 10న జుల్ఫికర్ గల్లిలోని తన సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లి రజియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం



లోకేశ్వరం(ముధోల్): మండలంలోని హవర్గలోని జాదవ్ సత్యనారాయణకు చెందిన గడ్డివాముకు బుధవారం నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. గ్రామ పరిసరాల్లో వరి కాడలకు నిప్పంటించడంతో సమీపంలోనే ఉన్న గడ్డివాముకు అంటుకుని దగ్ధమైంది. భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలు ఆర్పివేశారు.

చినుకుపడితే.. ఎటోళ్లటే

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): వర్షాకాలం వస్తుందంటేనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ఆదివాసీల్లో గుబులు రేకెత్తుతోంది. వానాకాలం వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో బాహ్యప్రపంచంతో వారికి సంబంధాలు తెగిపోతాయి. వాగులపై వంతెనలు లేకపోవడంతో మండల, జిల్లా కేంద్రానికి రావాలంటే ఇక్కట్లు తప్పవు. అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. విషజ్వరాలు, క్రిమికీటకాల కాటుకు గురైనవారు, గర్భిణులను ఆస్పత్రులకు తరలించాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని సర్పాపూర్(జే), వంకతుమ్మ, ముసల్‌పాడ్, లేండిగూడ, రాజులగూడ, కెస్లాగూడ, ఉమాపతికుంట, తదితర గ్రామాలతో పాటు నార్నూర్ మండలంలోని బారిక్‌రావుగూడ, ధన్నుగూడ, చిట్టగూడ, గాదిగూడ మండలంలోని కునికాసా, గణేశ్‌పూర్, ఇంద్రవెల్లి మండలంలోని జైత్రాంతాండ, చిత్తబట్ట, గోపాల్‌పూర్‌గూడ, మామిడిగూడ, జెండాగూడ, నిర్మల్ జిల్లా కడెం మండలంలోని అల్లంపల్లి, విద్దెచింత, గంగాపూర్, ఇస్లాంపూర్, కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని లక్మాపూర్, కరంజివాడ, జంకాపూర్, శంకర్‌లొద్ది గ్రామాల్లో నేటికీ సరైన రోడ్లు, వాగులపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానాఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు, వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.



వంకతుమ్మ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి (ఫైల్)



వంకతుమ్మ వాగు దాటి వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)



సర్పాపూర్(జే)కు వెళ్లాలంటే ఇలా అవస్థలు పడాల్సిందే(ఫైల్)



పొంగిపొర్లుతున్న లక్ష్మీపేట వాగు (ఫైల్)

మేనల్లుడిపై కత్తితో దాడి చేసిన మామ

- తీవ్రగాయాలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితుడు
- తప్పిన ప్రాణాపాయం



గాయాలతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న శోభన్

ఖానాపూర్: బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేఖానాయక్ అనుచరుడు ఎల్ములె శోభన్ బాబుపై బుధవారం అతని మేనమామ కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఎస్సై ఆర్ శంకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన శోభన్ ఉదయం 7.30 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఖానాపూర్‌కు వచ్చే క్రమంలో అతని మేనమామ నూనె నర్సింగ్‌రావు, కుమారుడు రణధీర్ కత్తితో దాడి చేశారు. వెంటాడి చంపేందుకు యత్నించగా గ్రామంలోని ఓ నివాసంలోకి వెళ్లి తలదాచుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడి నుంచి ఖానాపూర్‌కు వెళ్తుండగా నర్సింగ్‌రావు, మరో యువకుడు రామగిరి రాజుతో కలిసి వెంటాడారు. ఈ క్రమంలో ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ ముందు నుంచి ఆస్పత్రి వైపు కత్తితో వెళ్తున్న నర్సింగ్‌రావుతో పాటు రామగిరి రాజును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. రణధీర్ పరారీలో ఉన్నాడు. మేనమామల మధ్య నెలకొన్న ఆస్తి తగాదాల విషయంలో శోభన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని నర్సింగ్‌రావు, అతని కుమారుడు కక్ష పెంచుకుని, మరో యువకుడితో కలిసి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శోభన్ తండ్రి గోపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై సెక్షన్ 341, 307 ప్రకారం కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

- వారం క్రితం దుబాయ్‌లో లక్ష్మణచాంద వాసి మృతి



శ్రీనివాస్ మృతదేహం

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన పడతం శ్రీనివాస్(23) అనే యువకుడు ఈనెల 7న దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందగా.. బుధవారం అతడి మృతదేహం స్వగ్రామం చేరింది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మణచాందకు చెందిన శ్రీనివాస్ అనే యువకుడు కొద్ది నెలల కిందట బతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ నెల 7న అక్కడ రూములో ఉండగా శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. అతని రూములో ఉన్న మిత్రులు.. శ్రీనివాస్ మృతి సమాచారాన్ని అతడి కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబసభ్యులు సర్పంచ్ ముత్యంరెడ్డిని సంప్రదించి మృతదేహం తెప్పించాలని వేడుకున్నారు. స్పందించిన సర్పంచ్ ఎన్ఆర్ఐ భీమ్‌రెడ్డికి సమాచారం అందచేశారు. దీంతో ప్రవాసిమిత్ర లేబర్, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వదేశి పరికి పండ్ల సాయంతో మృతదేహం తెప్పించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో లక్ష్మణచాందకు శ్రీనివాస్ మృతదేహం చేరగా.. స్వదేశి పరికిపండ్ల నివాళులు అర్పించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



శంకర్ (ఫైల్)



పాలజ్ శంకర్ మృతదేహం

కుభీర్(ముధోల్): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం కుభీర్‌కు చెందిన పాలజ్ ఆనంద్‌కు ముగ్గురు కుమారులు. 11 సంవత్సరాల క్రితం అతని భార్య పోసానితో విడాకులుకాగా ఆమె డొంకేశ్వర్‌లో ఉంటోంది. తండ్రివద్ద పెద్ద కుమారుడు, తల్లి వద్ద మిగతా ఇద్దరు కుమారులు ఉంటున్నారు. తల్లి వద్ద ఉండే పాలజ్ శంకర్ (24) అప్పుడప్పుడు తండ్రివద్దకు వస్తుండేవాడు. ఈ నెల 12న కుభీర్‌కు వచ్చిన శంకర్ పంటచేలోకి వెళ్లడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో మృతి చెందాడు. బుధవారం పంటచేనుకు వెళ్లిన మృతుని సోదరుడు మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుని తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దుమ్మ శివన్న (47) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం మహారాష్ట్రలోని యావత్మాల్‌కు వెళ్లాడు. బుధవారం తలనొప్పి బాధ భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు దుమ్మ శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ(బోథ్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన చిలుకూరి మల్లేశ్ (45) తనకున్న భూమిని అమ్మి 2020లో కూతురు వివాహం చేశాడు. దీంతో పాటు అతని భార్య అనారోగ్యానికి గురైంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బయటకు వచ్చి అతని తమ్మునితో చెప్పడంతో 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సాగులో భిన్నత్వం

- రెండున్నర ఎకరాలు.. అనేక పంటలు
- సేంద్రియ పద్ధతిలో సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు శ్రీనివాస్‌రెడ్డి
- నిఘా నీడలో వ్యవసాయం



శ్రీనివాస్‌రెడ్డి సాగు చేస్తున్న తైవాన్ జామ

లక్ష్మణచాంద: అందరిలాగా ఎప్పుడు ఒకే రకమైన పంటలు చేసి నష్టపోవడం కంటే భిన్నంగా ఆలోచించాడు. నూతన పంటలు సాగు చేసి లాభాలు గడించాలనే లక్ష్యంతో తక్కువ భూమిలో అనేక రకాల పంటలు పండిస్తూ జిల్లాలోని ఉన్నతాధికారుల చేత ఔరా అనిపించుకుంటున్నాడు మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు.

రెండున్నర ఎకరాలలో...

రెండేళ్ల కిందట రైతు ఏలేటి శ్రీనివాస్ రెడ్డి సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. అక్కడ అనేక రకాల పంటలు సాగు చేయడం చూసి ఆశ్చర్యానికి లోనయ్యాడు. దీంతో తన రెండున్నర ఎకరాల భూమిని పూర్తిగా చదును చేయించారు. తోటలోకి అడవి జంతువులు రాకుండా ఉండడానికి తోట చుట్టూ ఎత్తు ఎక్కువగా ఉండే జాలిని ఏర్పాటు చేశాడు.

పలు రకాల పంటలు..

గత సంవత్సరం ఫిబ్రవరిలో రెండున్నర ఎకరాల్లో 450 తైవాన్ జామ, 100 దానిమ్మ, 200 మామిడి, 200 సపోట, సంత్ర, మోసంబి, అంజీర, బొప్పాయి, సీతాఫలం, నిమ్మ, పనస, అరటి, స్టార్ ఫ్రూట్ వంటి అనేక రకాల పండ్ల మొక్కలు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం వీటిలో తైవాన్ జామ కాత దశకు వచ్చింది. పండ్లు తెంపి నిత్యం అమ్ముతున్నాడు.

అంతర పంటలు అనేకం.....

తైవాన్, నిమ్మ, దానిమ్మ, సపోట వంటి పంటల్లో అనేక అంతర పంటలు సాగు చేస్తున్నాడు. ఇందులో ఇప్పటికే వేరుశనగ పంట రెండుసార్లు చేతికి వచ్చి రూ.90వేలు, దోసకు రూ.30వేలు, వాటర్‌మిలన్‌కు రూ.40వేలు, కొత్తమీరకు రూ.80వేల ఆదాయం వచ్చిందని, ప్రస్తుతం తోట కూర సాగు చేస్తున్నానని సదరు రైతు పేర్కొంటున్నాడు.

నాటుకోళ్లు...

నాటు కోళ్లకు ప్రత్యేకంగా షెడ్డు నిర్మించి రూ.లక్ష పెట్టుబడి పెట్టగా ఇప్పటికే రూ.2లక్షలు సంపాదించాడు. అలాగే గుడ్లను పొదగడానికి రూ.50 వేలు వెచ్చించి ఇంక్యుబేటర్ ఏర్పాటు చేశాడు. ఇందులో ఒకేసారి దాదాపు 500 గుడ్లను పొదిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 300 పిల్లలు, 50 పెద్ద నాటు కోళ్లు ఉన్నాయి. వీటి కేజీ చికెన్ రూ.350–400 ఉందని రైతు చెబుతున్నాడు.

నిఘా నేత్రాల నీడలో పంటల సాగు ....

సాధారణంగా మనం ఎక్కడకు వెళ్లినా గ్రామాల్లో, ఇళ్లల్లో సీసీ కెమెరాలను చూస్తాం. కానీ రైతు శ్రీనివాస్ రెడ్డి మాత్రం రూ.లక్ష వెచ్చించి తన తోట చుట్టూ మొత్తం 9 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సెల్ ఫోన్‌కు అనుసంధానం చేసుకుని 24 గంటలు తన తోటను పర్యవేక్షిస్తున్నాడు.

ఉన్నతాధికారుల సందర్శన...

మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ వరుణ్ రెడ్డి చామన్‌పెల్లిలో శ్రీనివాస్ రెడ్డి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా తక్కువ భూమిలో ఎక్కువ పంటలు సాగు చూసి రైతును అభినందించారు. ఇలా కలెక్టర్ ఒక్కరే కాదు డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి శ్యామ్‌రావు రాథోడ్ ఇలా ఎవరు వచ్చినా శ్రీనివాస్‌రెడ్డి తోటను పరిశీలించి రైతును అభినందిస్తున్నారు.

నేనెందుకు సాగు చేయకూడదనే

రెండేళ్ల కిందట సీఎం కేసీఆర్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం సందర్శించాను. అక్కడ అనేక రకాల పంటలు సాగు చేయడం చూసి తను ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనతోనే తను తన రెండున్నర ఎకరాల భూమిని రూ.25 లక్షల వరకు వెచ్చించి పూర్తి స్థాయిలో సిద్ధం చేసి 2022 ఫిబ్రవరి నుంచి పలు రకాల పంటలు సాగు చేస్తున్నాను. ప్రతి పంటలో మంచి ఆదాయం వస్తుంది.

– ఏలేటి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, చామన్‌పెల్లి



నాటు కోళ్లు



తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి



చామన్‌పెల్లిలో శ్రీనివాస్‌రెడ్డి తోట చుట్టూ వేసిన కంచె

ఒకరికి ఏడాది జైలు, జరిమానా

చెన్నూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి సంపత్ తీర్పునిచ్చినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. 2018 జూన్ 1న ముత్తెరావుపల్లె గ్రామానికి చెందిన రాజబాబు, కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన గడిపెల్లి బానయ్య ట్రాక్టర్‌పై వెళ్తుండగా చెన్నూర్ మండలం అక్కెపెల్లి గ్రామశివారులో వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరు అ క్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రాజ బాబు భార్య రాంశెట్టి రజిత ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ దార పరమేశ్‌పై కేసు నమోదు చేసి సాక్షులను ప్రవేశపెట్టగా బుధవారం శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



ప్రక్రియ పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



హాజరైన అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత కల్పించామన్నారు. మొదటి రోజు 500 మంది అభ్యర్థులకు గానూ 445 మంది హాజరుకాగా 55 మంది గైర్హాజరయ్యారన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీ.సమయ్‌జాన్‌రావు, ఏవో యునూస్ అలీ, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



బాకె శ్రీనిధి



కొమ్ము సాయితి



ఎల్టి రిత్విక్ రెడ్డి



ర్యాంకులు సాధించిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: నీట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బాకె శ్రీనిధి 520, కొమ్ము సాయితి 539, తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన ఎల్టి రిత్విక్ రెడ్డికి 507 మార్కులు వచ్చాయి. వీరితో పాటు ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆయుష్ ఫాతిమాకు 1940వ ర్యాంక్, చౌహాన్ మిథిలికి 492 మార్కులు, దాసరి విష్ణువర్ధన్ 453 మార్కులు, సియారాణి 435, అగర్వాల్ రాధిక 410, యోగిత పవార్ 395, రాథోడ్ అక్షయ 367, నందిత 364, అభినయశ్రీ 360 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బ్రహ్మం, జైపాల్‌రెడ్డి, అరవింద్ విద్యార్థులను అభినందించారు.